క్లుప్తంగా

వైభవంగా లక్ష్మీగణపతి హోమం



విఘ్నేశ్వరుని సన్నిధిలో లక్ష్మీగణపతి హోమంలో పాల్గొన్న భక్తులు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరుని సన్నిధిలో లక్ష్మీగణపతి హోమం శనివారం వైభవంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు హాజరై ఈ పూజలో పాల్గొన్నారు. అలాగే స్వామివారి సన్నిధిలో చిన్నారులకు అన్నప్రాశనలు, అక్షరాభ్యాసాలు, నామకరణలు వంటి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా లక్ష్మీగణపతి విగ్రహ ప్రతిష్ఠ



మాచవరంలో లక్ష్మీగణపతికి పూజలు చేస్తున్న దంపతులు

అంబాజీపేట: మాచవరం శివాలయం రోడ్డులో డీకేఆర్ గార్డెన్స్‌లో వేంచేసిన వరసిద్ధి వినాయక ఆలయంలో లక్ష్మీగణపతి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు సత్తిబాబు పర్యవేక్షణలో దొమ్మేటి శ్రీనివాసరావు, నిర్మలకుమారి దంపతుల ఆధ్వర్యంలో స్వామికి గణపతి హోమం, శాంతి కల్యాణం, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పసిడి కుండల ప్రతిష్ఠ

అంబాజీపేట: మాచవరంలో వేంచేసిన పార్వతీ సమేత రాజేశ్వరస్వామి ఆలయ శిఖరానికి పసిడి కుండలను శనివారం ప్రతిష్ఠించారు. అమలాపురానికి చెందిన నాగలక్ష్మి ఐరెన్ స్టోర్స్ కాండ్రేగుల రాంప్రసాద్, అరుణ్‌కుమార్, మల్లేశ్వరరావులు సమకూర్చిన రూ.20 లక్షలతో రాజగోపురాన్ని నిర్మించారు. రూ.40 వేలు విలువ చేసే మూడు పసిడి కుండలను ప్రతిష్ఠించి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

గృహనిర్మాణానికి ఆర్థిక సాయం



పొన్నమండలో ఆర్థిక సాయం అందిస్తున్న ఫ్యూచర్ ఇండియా ప్రతినిధులు

రాజోలు: పొన్నమండ గ్రామానికి చెందిన నిరుపేద తాడి కృష్ణవేణి గృహ నిర్మాణానికి ఫ్యూచర్ ఇండియా ఫౌండేషన్ రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందించింది. శనివారం ఈ సాయాన్ని ఫ్యూచర్ ఇండియా వ్యవస్థాపక చైర్మన్ సరెళ్ల సతీష్‌సావిత్రి అందజేశారు. రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల్లో 38 కుటుంబాలకు ప్రతినెలా అందించే రేషన్ పంపిణీలో భాగంగా మొదటివారం సాయాన్ని అందజేశారు. ఫౌండేషన్ ప్రతినిధులు రాజశేఖర్, డాక్టర్ శివకుమార్, దుర్గాప్రసాద్, రాంబాబు, అన్సారీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నూకాంబిక కొత్తపూల ఉత్సవాలు

ఆలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసిన నూకాంబిక అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన మూడో విడత కొత్తపూలు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. స్థానిక అమ్మవారి ఆలయంలో మన్యసీమ నుంచి తీసుకువచ్చిన మోదుగుపూలను పెద్దగరగకు అలంకరించి శుక్రవారం రాత్రి ఆరో విడత ఉత్సవాలను నిర్వహించారు. చర్మ వాయిద్యాల దరువుకు అనుగుణంగా ఆలయ ఆసాదుల బృంద సభ్యులు అత్యధిక గరగలను నెత్తిన ధరించి చేసిన గరగనృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. చిన్నారుల చేసిన గరగ నృత్యాలు భక్తులను అలరించాయి. పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి కొత్తపూల ఉత్సవాలను తిలకించారు. పూలగరగకు పూలు, అగరవత్తులు సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన శక్తివేషాలు, విచిత్ర వేషధారణ, కోయి నృత్యాలు తదితర వినోద కార్యక్రమాలను భక్తులు ఆసక్తిగా తిలకించారు.

వార్డు సభ్యుడిపై చర్యలు తీసుకోవాలి

అంబాజీపేట: ప్రశాంత వాతావరణాన్ని భంగపరిచేలా వ్యవహరిస్తున్న కె.పెదపూడి వార్డు సభ్యుడు బీర రాజారావుపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని అంబాజీపేట మండల దండోరా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై ఎ.చైతన్యకుమార్‌కు శనివారం వినతిపత్రం అందించారు. అలాగే రాజారావుకు సహకరించిన హెల్త్ సూపర్‌వైజర్ ఎస్.మధుబాబుపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ముక్కామల పీహెచ్‌సీ వైద్యులకు వినతిపత్రం అందజేశామని చెప్పారు.

గాలికొదిలేయొద్దు..

- సకాలంలో గాలికుంటు వ్యాధి టీకాలు అవసరం
- నిర్లక్ష్యం వహిస్తే పశువులు మృత్యువాత



మాచవరంలో పశువులకు గాలికుంటు టీకా వేస్తున్న పశు వైద్య సిబ్బంది

అంబాజీపేట: పశువుల పాల ఉత్పాదక శక్తిని దెబ్బతీసే వ్యాధుల్లో ప్రధానమైనది గాలికుంటు వ్యాధి. ఫట్ అండ్ మౌత్ డిసీజ్‌గా పేర్కొనే ఈ వ్యాధి వైరస్ ద్వారా వ్యాప్తి చెందుతుంది. ఈ వ్యాధి కారణంగా ఒక్కో సమయంలో పశువులు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. పాడి రైతులు సరైన చికిత్స విధానాలు పాటిస్తే పశువులను కాపాడుకునే వీలుంటుంది. ఈ నెల ఒకటో తేదీ నుంచి నెలాఖరు వరకు గాలికుంటు వ్యాధి నివారణకు సామూహిక టీకాల కార్యక్రమం చేపడుతున్నారు. ఈ ఏడాది పశువులకు ఇనాఫ్ ట్యాగ్ ఉంటేనే గాలికుంటు నివారణ టీకాలు వేస్తారు. ఇనాఫ్ ట్యాగ్ వేయించుకోవల్సిన బాధ్యత రైతులదేనని పశువైద్యాధికారులు చెబుతున్నారు. గాలికుంటు వ్యాధి సోకితే పశువులు మేత మేయలేవు. ఎక్కువ సమయం నిలబడలేవు. చికిత్స సకాలంలో అందించకపోతే పశువులు మృతి చెందుతాయి. గాలికుంటు వ్యాధిని నివారించటానికి పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నెలరోజులు గాలికుంటు నిరోధక టీకాలు ఇస్తున్నారు. పి.గన్నవరం నియోజకవర్గంలో ఆవులు 9,500, గేదెలు 12,300, కొత్తపేట నియోజకవర్గంలో ఆవులు 6180,, గేదెలు 8,500, రాజోలు నియోజకవర్గంలో ఆవులు 5,150, గేదెలు 8,070 ఉన్నాయి.

వ్యాధి లక్షణాలు

ముందుగా పశువు నోటి నుంచి చొంగ కారడం ప్రారంభం అవుతుంది. ఇదే సమయంలో పక్క వాటికి సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. గాలికుంటు వ్యాధి సోకిన పశువులకు ఒక్కసారిగా జ్వరం పెరుగుతుంది. పశువుల్లో 104 నుంచి 105 డిగ్రీల టెంపరేచర్ ఉంటుంది. పశువుల నాలుకలపై చిగుళ్లపై పుండ్లు వస్తాయి. పశువుల కాళ్ల డెక్కల మధ్యలో పుండ్లు ఏర్పడతాయి. దీనితో పశువులు మేత మేయలేవు, నడవలేవు. నెలరోజుల వయస్సున్న దూడలు, ఈ వ్యాధి ఉన్న పశువులపాలు తాగితే వ్యాధి సోకి మరణిస్తాయి. వ్యాధి సోకిన పశువులను ఎండలో ఎక్కువ సేపు ఉంచలేదు. ఈ లక్షణాలు కనబడగానే పశులును వెంటనే వైద్యాధికారికి చూపించి చికిత్స అందించాలి. గాలికుంటు వ్యాధి సోకినట్లు అనుమానం వస్తే వెంటనే పశువైద్యాధికారిని సంప్రదించి పరీక్షలు చేయించుకోని వాటి నివారణకు మందులు వాడుకోవాలి. గాలికుంటు వ్యాధి నివారణకు ప్రభుత్వం 11 ఏళ్లుగా సంవత్సరానికి రెండు సార్లు టీకాలు వేస్తున్నారు. ప్రభుత్వ రక్ష వ్యాక్సిజన్, ఒవెక్ వ్యాక్సిజన్‌ను అందిస్తున్నారు. గాలికుంటు వ్యాధి ఉంటే వాటి నివారణకు ఆక్సిటెట్రాసైక్లిన్, నిముసులైడ్ ఇంజెక్షన్‌లు వాడుకోవాలి.

తొలి దశలోనే వ్యాధిని గుర్తించాలి



పశువులకు గాలికుంటు వ్యాధిని తొలి దశలో గుర్తిస్తే పశువుల ప్రాణాలకు నష్టం ఉండదు. పశువులపై రైతులకు అనుమానం రాగానే పరీక్షలు చేయించుకొని మందులు వాడటం వలన మందలోని మిగిలిన పశులవుకు వ్యాధి సోకదు.

– డి.రాజేంద్ర, పశువైద్యాధికారి, అంబాజీపేట

వాడపల్లి వెంకన్నకు కలెక్టర్ దంపతుల ప్రత్యేక పూజలు



తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ మాధవీలతకు స్వామి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. శనివారం తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ మాధవీలత దంపతులతో కలసి ఆయన స్వామిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేదాశీర్వచనం అందించారు. కలెక్టర్ మాధవీలత దంపతులు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అర్చకులు స్వామి వారి చరిత్ర వివరించారు. అనంతరం ఆమెతో పాటు చిర్ల జగ్గిరెడ్డి ఆలయంలో పర్యటించి భక్తుల సమస్యలను తెలుసుకున్నారు. ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం తరఫున తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వరస్వామి

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామిని అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారు పూర్ణాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. చెరకు, ప్రత్యేక పువ్వులతో స్వామిని అలంకరించారు. ఆలయాన్ని ప్రత్యేక పువ్వులతో అలంకరించారు. స్వామిని అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తమ మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి స్వామికి పటికబెల్లం తులాభారంగా సమర్పించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, సిబ్బంది పర్యవేక్షించారు.

కిక్కిరిసిన వేంకటేశ్వరుని ఆలయం

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. స్వామికి ఆలయ ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి కానుకలు, మొక్కులు చెల్లించారు. చిన్నారులకు తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు.

లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల అందజేత



మానేపల్లిలో లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలను అందించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

పి.గన్నవరం: రాష్ట్రంలో ఒకేసారి 31 లక్షల మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మండలంలోని మానేపల్లి గ్రామంలో ఇళ్ల స్థలాల లేఅవుట్‌ను మెరక చేసి, రోడ్లు నిర్మించిన అనంతరం 96 మంది లబ్ధిదారులకు శనివారం ఆయన ఇళ్ల స్థలాలను అందజేశారు. సర్పంచ్ పితాని చంద్రకళ అధ్యక్షతన జరిగిన సమావేశంలో చిట్టిబాబు మాట్లాడారు. తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్, డీటీ బి.గోపాలకృష్ణ, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ మద్దుల వరలక్ష్మి, పార్టీ నాయకులు పితాని నర్సింహారావు, నక్కా వెంకటేశ్వరరావు, చిట్టూరి రవికుమార్, యన్నాబత్తుల నాగభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

గృహసారథులు ప్రజలతో మమేకం కావాలి..

గృహ సారథులు ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేసి, ప్రజలకు సంక్షేమ పథకాలను అందించాలని ఎమ్మెల్యే చిట్టిబాబు అన్నారు. వాడ్రేవుపల్లిలో శనివారం ఆయన గృహ సారథులకు, సచివాలయ కన్వీనర్లతో అవగాహన సదస్సు నిర్వహించారు. పార్టీ నాయకులు యల్లమిల్లి శ్రీను, పితాని సురేష్, చిట్టూరి శివ, మంగం చిట్టిబాబు, రాధ, చిలకపాటి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ యుటిలిటీస్ చైర్మన్ మేరీగ్రేస్‌కు సన్మానం



వాడపాలెంలో లోక్ అదాలత్ పబ్లిక్ యుటిలిటీస్ చైర్మన్ మేరీగ్రేస్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పర్మినెంట్ లోక్ అదాలత్ ఫర్ పబ్లిక్ యుటిలిటీ సర్వీసెస్ చైర్మన్‌గా నియమితులైన జడ్జి అజ్జరపు మేరీగ్రేస్ నియోజకవర్గానికి ఎంతో గర్వకారణమని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. కొత్తపేట మండలం వాడపాలేనికి చెందిన మేరీగ్రేస్ న్యాయవాదిగా, జడ్జిగా, జిల్లా జడ్జిగా పనిచేసి ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. ఆమె సేవలను గుర్తించిన హైకోర్టు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పర్మినెంట్ లోక్ అదాలత్ ఫర్ పబ్లిక్ యుటిలిటీ సర్వీసెస్ చైర్మన్‌గా నియమించింది. శనివారం మేరీగ్రేస్ స్వగ్రామం వాడపాలెంలో ఆమె కుటుంబ సభ్యులు, గ్రామస్తులు సన్మానం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మేరీగ్రేస్‌ను ఘనంగా సత్కరించారు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు వివిధ రీతుల్లో ఈ సందర్భంగా జగ్గిరెడ్డి మాట్లాడుతూ మేరీగ్రేస్ ఉన్నతమైన న్యాయవాది చదువు చదివి, జడ్జిగా, జిల్లా జడ్జిగా ఉత్తమ సేవలందించారన్నారు. ఇప్పుడు లోక్ అదాలత్ పబ్లిక్ యుటిలిటీస్ చైర్మన్‌గా నియమితురాలు కావడం ఎంతో గొప్ప విషయమన్నారు. ఎంత ఎత్తుకు ఎదిగినా స్వగ్రామాన్ని మరువకుండా సేవలందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి పంచలోహ విగ్రహం సమర్పణ



పంచలోహ విగ్రహాన్ని సమర్పిస్తున్న దాత

అమలాపురం రూరల్: పాత బండారులంక బీళ్ల వారి వీధిలో ఉన్న పద్మావతి అలివేలు మంగ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయానికి తంగిరాల సోమనాథ్‌పవన్–శ్రీదేవి దంపతులు వేంకటేశ్వర స్వామి పంచలోహ విగ్రహాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మ వార్లకు విశేష పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయం వద్ద శ్రీనివాసా బాలమిత్ర సంఘం అధ్వర్యంలో విలస కంటి ఆసుపత్రి వైద్య బృందం ఉచిత కంటి పరీక్షలు చేశారు. పీహెచ్‌సీ బండారులంక ఆధ్వర్యంలో 200 మందికి సుగర్, బీపీ పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి వాసునాయక్, ఎంపీహెచ్‌ఓ కాశిన శేషబాబు, శ్రీనివాస బాలమిత్ర సంఘం ప్రతినిధులు చింతపట్ల బాబు, నల్లా శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం పాలన

- ఎమ్మెల్యే చిట్టిబాబు
- నరేంద్రపురంలో గడప గడపకూ..



నరేంద్రపురంలో ప్రభుత్వ పథకాలను మహిళలకు వివరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

పి.గన్నవరం: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. నరేంద్రపురంలో శనివారం గడపగడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. మండల శాఖ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు మెల్లం మహాలక్ష్మిప్రసాద్, పార్టీ నాయకులు జల్లి శ్రీను, రాయుడు చిన్న, నేలపూడి సత్యనారాయణ, గుత్తుల త్రిమూర్తులు, సత్యనారాయణ తదితరులతో కలసి చిట్టిబాబు ఇంటింటికీ తిరిగి ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. జగన్ పాలనలో చేకూరిన లబ్ధిని కుటుంబాల వారీగా చిట్టిబాబు వివరించారు. ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న జగన్‌ను ఆశీర్వదించాలని చిట్టిబాబు కోరారు. సర్పంచ్‌లు బీర వెంగమాంబ, కొంబత్తుల ఏసు, వడలి కొండ, నాయకులు కొంబత్తుల శేఖర్, ఇళ్ల నాగేశ్వరరావు, కోట నాగేంద్రప్రసాద్, కొక్కిరి రవికుమార్, ఎన్.యువరాజు, దొమ్మేటి సత్యమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరికలు



నరేంద్రపురంలో పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

పి.గన్నవరం: ముఖ్యమంత్రి జగన్ అందిస్తున్న పాలనను మెచ్చిన ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. నరేంద్రపురంలో మాజీ సర్పంచ్ ఇళ్ల కనకదుర్గ, ఆమె భర్త సత్యనారాయణతో సహా 10 కుటుంబాల వారు శనివారం చిట్టిబాబు సమక్షంలో పార్టీలో చేరారు. అలాగే నాగుల్లంకకు చెందిన జోగి సత్యనారాయణ టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీ నాయకులు నక్కా వెంకటేశ్వరరావు, అడ్డగళ్ల వెంకట సాయిరామ్, దేశిరాజు సీతారామయ్య, జల్లి శ్రీను, రాయుడు చిన్న, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దళితులు ఎప్పుడూ వైఎస్సార్ సీపీ వెంటే..

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి
- అవిడిలో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక



అవిడిలో పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

కొత్తపేట: ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా దళితులు ఎప్పుడూ వైఎస్సార్ సీపీ వెంటే ఉన్నారని, ఉంటారని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని అవిడిలో టీడీపీ వార్డు సభ్యుడిగా పోటీ చేసిన కుసుమే శ్రీనివాసరావు, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు నేతల బాబ్జి, ఇసుకపట్ల రాముడు, ఇసుకపట్ల శ్రీను, పిట్టా మహేష్, నామాడి గోపి, నామాడి శేఖర్, డొల్లా రాజారత్నం తదితరులు టీడీపీకి స్వస్తి చెప్పి శనివారం ఎమ్మెల్యే జగ్గిరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఆయన పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. జగ్గిరెడ్డి మాట్లాడుతూ దళితులను వైఎస్సార్ సీపీ నుంచి దూరం చేయాలని ఎవరు ప్రయత్నిస్తున్నారో అందరికీ తెలుసన్నారు. మాయమాటలు చెప్పి, మభ్యపెట్టి కొంతమందిని వారికి ఇష్టం లేకపోయినా టీడీపీ కండువాలు వేసి ఆ పార్టీలో చేరినట్టు చేసే నీచ రాజకీయాలు మానుకోవాలని టీడీపీ వారికి హితవు పలికారు. కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డి చంటి, ఎంపీటీసీ సభ్యులు నేతల వెంకటలక్ష్మి, నేలపూడి భీమరాజు, కొత్తపేట హెచ్‌డీసీ సభ్యుడు పల్లి దిలీప్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ నామాడి రాజారత్నం, పార్టీ మండల యువజన విభాగం కన్వీనర్ గొల్లపల్లి స్వరూప్, వాడపాలెం గ్రామ పార్టీ అధ్యక్షుడు మట్టా బాబ్జి, పార్టీ నాయకులు పెదపూడి బాపిరాజు, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ అంగన్‌వాడీ టీచర్ మృతి



నిర్మల (ఫైల్)

సఖినేటిపల్లి: అంతర్వేదిపాలెం శివారు అడ్డాలపాలెంలో ఈ నెల 4న రోడ్డు ప్రమాదంలో గాయపడి కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అంగన్‌వాడీ టీచర్ గెడ్డం నిర్మల (48) శనివారం మృతి చెందింది. ఈ మేరకు కాకినాడ నుంచి సమాచారం వచ్చినట్టు పోలీసులు తెలిపారు. 4వ తేదీన అడ్డాలపాలెంలో నిర్మిస్తున్న భవనం వద్ద పనిచూసుకునే నిమిత్తం బైక్‌పై ఆమె వస్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ అజాగ్రత్తగా నడుపుతూ బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో ఆ ప్రమాదంలో ఆమె తీవ్రంగా గాయపడింది. దీనిపై ఆమె ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు అప్పట్లో కేసు నమోదు చేశారు. కాగా ప్రమాదంలో గాయపడిన ఆమెను తొలుత అమలాపురం, అటుపై కాకినాడ ట్రస్ట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నిర్మల మృతి చెందారు. మృతురాలికి భర్త నవీన్ బాబు, ఇద్దరు సంతానం ఉన్నారు. ఆమె మృతికి సహచర అంగన్‌వాడీలు తీవ్ర సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

శిథిల స్థితిలో బోడిపాలెం వంతెన



దెబ్బతిన్న బోడిపాలెం వంతెన రెయిలింగ్

కపిలేశ్వరపురం: కొత్తపేట–కపిలేశ్వరపురం నియోజకవర్గాలను కలిపే బోడిపాలెం వంతెన శిథిల స్థితిలో ఉంది. బ్రిటిష కాలంలో నిర్మించిన ఈ వంతెన కూలేందుకు సిద్ధంగా ఉంది. ఇనుప భాగాలు తుప్పుపట్టి పైకి ప్రమాదభరితంగా దర్శనమిస్తున్నాయి. వంతెన ఇరుకుగా ఉండటంతో వ్యవసాయ ఉత్పత్తులను తరలించే వాహనాలు రాకపోకల సమయంలో రైతులు అవస్థలు పడుతున్నాయి. కేదారిలంక గ్రామ శివారు వీధివారిలంకలోని ధనమ్మమర్రి దైవ, పర్యాటక ప్రాంతానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో ఈ వంతెన మీదుగా తరలి వస్తుంటారు. ఎంతో ప్రాధాన్యం ఉన్న బోడిపాలెం వంతెనను పునర్నిర్మించాలని పర్యాటకులు, భక్తులు, లంక గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నేడు వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం

అంబాజీపేట: వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు శనివారం తెలిపారు. గ్రామాల్లో ఉన్న దివంగత నేత వైఎస్సార్ విగ్రహాలకు నూతన రంగులు వేయించి నివాళులర్పించాలన్నారు. పార్టీ జెండాను ఆవిష్కరించాలన్నారు. ప్రతి మండలంలోను సేవా కార్యక్రమాలు జరపాలన్నారు. పండగ వాతావరణంలా ఆవిర్భావాన్ని జరుపుకోవాలన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ హాజరై విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. మూడున్నరేళ్లలో సీఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నింటిని నూటికి నూరు శాతం పూర్తి చేసి ప్రజల మనిషి అయ్యారన్నారు.

19న లక్ష్మీనృసింహుని కల్యాణం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో ఈ నెల 19న ఆర్జిత సేవగా స్వామివారి శాంతి కల్యాణం బహుళ ద్వాదశి తిథి నాడు నిర్వహిస్తున్నట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ శనివారం తెలిపారు. కల్యాణం టికెట్ల ముందస్తు బుకింగ్‌ను టెంపుల్ వెబ్‌సైట్ ద్వారా, ఆలయం వద్ద కౌంటర్ వద్ద తీసుకోవచ్చన్నారు.

క్యాన్సర్ బాధిత మహిళకు చేయూత



క్యాన్సర్‌తో బాధపడుతున్న సత్యవతికి సొమ్ము అందజేస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు

అయినవిల్లి: మండలంలోని ఎస్.మూలపాలెంలో క్యాన్సర్‌తో బాధపడుతున్న ఓ మహిళకు విశ్వబ్రాహ్మణ యువత శనివారం చేయూతనందించారు. ఎస్.మూలపాలెం గ్రామానికి చెందిన మొగలి సత్యవతి క్యాన్సర్‌తో బాధపడుతుంది. ఆమెకు విశ్వబ్రాహ్మణ యువత కోసూరి చిదంబరాచారి, బొల్లోజు మణిశ్రీకాంత్ ఆధ్వర్యంలో రూ.12 వేలు సేకరించారు. ఈ సొమ్మును సంఘ జిల్లా అధ్యక్షుడు కట్టోజు సన్యాస్యదాసు, వాణిజ్య విభాగం కార్య నిర్వహణ కార్యదర్శి బోళ్ల వెంకటరమణ చేతుల మీదుగా అందజేశారు. సర్పంచ్ బొబ్బ ప్రభాత్‌కుమార్ తదితరులు వీరిని అభినందించారు.

ర్యాలి కేశవస్వామి సన్నిధిలో హైకోర్టు జడ్జి



స్వామి చిత్రపటం అందిస్తున్న ఈవో కృష్ణచైతన్య

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవ స్వామి ఆలయంలో శనివారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి పి.వెంకట జ్యోతిర్మయి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెకు ఆలయ ఈవో బి.కృష్ణచైతన్య ఆధ్వర్యంలో అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయంలో స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆశీర్వచనం అందించారు. అనంతరం ఈవో కృష్ణచైతన్య స్వామి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. ఆమె వెంట తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎస్సై సుధాకర్ తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ ఇళ్లు నిర్మిస్తాం

ఆత్రేయపురం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఎవరెన్ని అడ్డంకులు సృష్టించిన అర్హులైన పేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తామని ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. శనివారం ఆయన వెలిచేరులో యుజీపాలెం వద్ద జగనన్న కాలనీలో జరిగిన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ ప్రభుత్వం అర్హులందరికీ ఇళ్లు నిర్మిస్తుందన్నారు. ఇంకా కొన్ని చోట్ల స్థలాలు పూడ్చాల్సి ఉందన్నారు. ఈ వేసవి ముగిసే నాటికి అవి కూడా పూర్తి చేసి అందరికీ ఇళ్ల స్థలాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, జిల్లా పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కప్పల శ్రీధర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

సఖినేటిపల్లి: మండలంలోని అంతర్వేదిపాలెంలో శనివారం పేకాట శిబిరంపై ఎస్సై ఎస్.రాము ఆధ్వర్యాన పోలీసు సిబ్బంది ఆకస్మిక దాడి చేశారు. దాడిలో పేకాడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి నగదు రూ.67,200 స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై అన్నారు.